క్లుప్తంగా

ఆర్యవైశ్యులపై దాడులు తగదు

మన్ననూర్: ఆర్యవైశ్య నాయకులు ఆంజనేయులు, నరేష్‌లపై కల్వకుర్తికి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు, మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం చేసిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని ఆర్యవైశ్య మహాసభ నాయకులు వెంకటరమణ, సత్యనారాయణ, రమేష్‌లు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దాడి చేసిన వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. లేని పక్షంలో మహాసభ ఆధ్వర్యంలో కార్యచరణ చేపట్టి జిల్లా వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు.

వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే



పెంట్లవెల్లి: రాష్ట్రంలో వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని ఆ పార్టీ మండల అధ్యక్షుడు నర్సింహయాదవ్ ఆశాభావం వ్యక్తం చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నియంత పాలనకు చరమగీతం పాడేందుకు ఓటర్లు కాంగ్రెస్ వైపు మొగ్గుచూపారని వివరించారు. ఆరు గ్యారంటీలను కాంగ్రెస్ అమలు చేస్తుందని పేర్కొన్నారు. యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నర్సింహనాయుడు, డిష్‌రవి, ఈశ్వరయ్య, రాజు, నరేష్‌లు పాల్గొన్నారు.

వరి కొనుగోలు కేంద్రం ప్రారంభించండి

కోడేరు: వరి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని మండల రైతులు కోరుతున్నారు. వరి కోతలు కోసి దాదాపు 20 రోజులు కావొస్తున్నా అధికారులు కొనుగోలు కేంద్రాలను ప్రారంభించక పోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని అన్నారు. అకాల వర్షాలు వస్తే వరిధాన్యం తడిసిపోయే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి మండలంలో వరి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

మైసమ్మ దేవతకు ఎమ్మెల్యే అభ్యర్థి పూజలు

పెద్దకొత్తపల్లి: రాజేందర్‌నగర్ నియోజకవర్గ ఎంఐఎం ఎమ్మెల్యే అభ్యర్థి మాండవగిరి స్వామి యాదవ్ శుక్రవారం నాయినోనిపల్లి మైసమ్మను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొల్లాపూర్ మండలంలోని చుక్కాయిపల్లి గ్రామానికి చెందిన మాండవగిరి స్వామి యాదవ్ హైదరాబాద్‌లో స్థిరపడి 2021లో ఎంఐఎం అర్బన్ డివిజన్‌లో కార్పోరేటర్‌గా గెలుపొందారు. ఎమ్మెల్యేగా గెలుపొందాలని అమ్మవారిని మొక్కులు తీర్చుకున్నారు. ఆయన వెంట సాతాపూర్ ప్రవీణ్ యాదవ్, శ్రీనివాస్ యాదవ్‌పాల్గొన్నారు.

ప్రమాదకరంగా కాజ్‌వే బ్రిడ్జి



తాదూరు: మండల కేంద్రం నుంచి గగ్గలపల్లి మీదుగా జిల్లా కేంద్రానికి వెళ్లే ప్రధాన ఆర్‌అండ్‌బీ డబుల్‌రోడ్డు గగ్గలపల్లి సమీపాన ఉన్న కాజ్‌వే బ్రిడ్జికి రక్షణ గోడ లేకపోవడం ప్రమాదకరంగా మారింది. రెండేళ్ల కిందట జరిగిన ప్రమాదంలో పిల్లర్లు ధ్వంసం అయ్యాయి. అప్పట్లో ఆర్‌అండ్‌బీ అధికారులు బ్రిడ్జిని పరిశీలించారు. కాని మరమ్మతు చేయడంతో నిర్లక్ష్యం వహిస్తున్నారు. దీంతో కాజ్‌వేపై ప్రయాణించేందుకు వాహనదారులు జంకుతున్నారు. బిక్కుబిక్కుమంటూ ప్రయాణించాల్సిన దుస్థితి నెలకొందని పలువురు వాపోయారు.

మురుగుకాల్వలను శుభ్రం చేయండి



తాదూరు: మండల కేంద్రంలోని 5వ వార్డులో ఉన్న మురుగు కాల్వ శుభ్రం చేయకపోవడంతో దోమలు, ఈగలకు నిలయంగా మారి దుర్వాసన వెదజల్లుతోంది. సమీపంలోని నివాస ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పంచాయతీ సిబ్బంది, అధికారులు స్పందించి మురుగుకాల్వను శుభ్రం చేసి బ్లీచింగ్ పౌడర్‌ను చల్లాలని కోరుతున్నారు.

పెరిగిన ఓటింగ్ శాతం



కొల్లాపూర్‌లో అభ్యర్థులు, ఎన్నికల ఏజెంట్లతో మాట్లాడుతున్న ఆర్‌ఓ కుమార్ దీపక్

కొల్లాపూర్: నియోజకవర్గంలో 81.42 శాతం ఓటింగ్ నమోదైనట్లు రిటర్నింగ్ అధికారి కుమార్ దీపక్ వెల్లడించారు. నియోజకవర్గంలోని 7 మండలాల్లో మొత్తం 2,34,167 మంది ఓటర్లు ఉండగా, వీరిలో 1,90,669 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. వీరిలో పురుష ఓటర్లు 1,19,263 మంది ఉండగా, 98,114 మంది ఓటు వేశారు. మహిళా ఓటర్లు 1,14,900 మందికి 92,553 మంది మహిళలు ఓటు వేశారు. థర్డ్ జెండర్ ఓట్లు 4 ఉండగా వీరిలో ఇద్దరు ఓటు హక్కును వినియోగించుకున్నారు. 2018 ఎన్నికల్లో కొల్లాపూర్ నియోజకవర్గంలో ఓటింగ్ శాతం 82.72 గా నమోదైంది. మొత్తం 2,08,941 ఓట్లు ఉండగా, 1,72,846 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. గత ఎన్నికల్లో కంటే ఈసారి 17,823 మంది ఎక్కువగా ఓట్లు వేశారు.

అత్యధికం, అత్యల్పం..

నియోజకవర్గంలో మొత్తం 269 పోలింగ్ బూతులు ఉండగా, వీటిలో మెజారిటీ కేంద్రాల్లో 80 శాతానికి పైగా ఓటింగ్ నమోదైంది. చిన్నంబావి మండలం పెద్దదగడలో 172 పోలింగ్ బూతులో అత్యధికంగా 96.73 శాతం ఓటింగ్ నమోదైంది. ఈ బూతులో 765 ఓట్లకు గాను 740 ఓట్లు పోల్ అయ్యాయి. అదే విధంగా చెల్లెపాడులోని 176 బూతులో 91.15 శాతం, కొప్పునూరు గ్రామంలోని 180 బూతులో 90.27శాతం, దగడపల్లిలోని 168 బూతులో 90.36 శాతం, వీపనగండ్ల మండలం సంపత్రావుపల్లి గ్రామంలోని 151 బూతులో 90.25 శాతం, రంగవరం గ్రామంలోని 150 బూతులో 91.86 శాతం, పాన్‌గల్ మండలంలోని బండపల్లి గ్రామంలో గల 131 బూతులో 90.27 శాతం, పెద్దకొత్తపల్లి మండలంలోని చంద్రబండ తండాలో 46వ బూతులో 91.79శాతం, కొల్లాపూర్ మండలంలోని తెల్లపలుగు తండాలో 91.86 శాతం, పెంట్లవెల్లి మండలంలోని కొండూరులో గల 197 బూతులో 90.12 శాతం ఓటింగ్ నమోదైంది. అత్యల్పంగా కొల్లాపూర్ పట్టణంలోని 250 వబూతులో 52.30 శాతం, పెద్దకొత్తపల్లి మండలం కల్వకోలు గ్రామంలోని 51 వ బూతులో 69.62 శాతం, పెద్దకొత్తపల్లి మండల కేంద్రంలోని 16 బూతులో 67.41 శాతం, వెన్నచెర్ల గ్రామంలోని 1 వ బూతులో 67.24, చంద్రకల్ గ్రామంలోని 6 వబూతులో 69.45 శాతం పోలింగ్ నమోదైంది.

కౌంటింగ్ ప్రక్రియపై అవగాహన

నియోజకవర్గ ఎన్నికల కౌంటింగ్‌పై శుక్రవారం జిల్లా కేంద్రంలో అగ్రికల్చర్ మార్కెట్‌యార్డులో అవగాహన సమావేశం ఏర్పాటు చేశారు. పోటీలో ఉన్న అభ్యర్థులు, వారి ఏజెంట్లు సమావేశానికి హాజరయ్యారు. కౌంటింగ్ ప్రక్రియలో పాల్గొనే వారు పాటించాల్సిన నిబంధనలు, ఇత అంశాలను రిటర్నింగ్ అధికారి కుమార్ దీపక్ వారికి వివరించారు.

77 శాతం పోలింగ్ నమోదు

లింగాల: అసెంబ్లీ ఎన్నికల్లో మండలంలో 77 శాతం పోలింగ్ నమోదైనట్లు అధికారుల వెల్లడించారు. మండలంలో మొత్తం 34 కేంద్రాలను ఏర్పాటు చేశారు. మండల వ్యాప్తంగా 30,060 వేల ఓట్లు ఉండగా 23,026 వేల ఓట్లు పోలైనట్లు అధికారులు తెలిపారు. మండలంలోని అప్పాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని 367 ఓట్లకు గాను 8 కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఆయా పెంటలలో 233 మంది చెంచులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 2018 ఎన్నికలకు కన్న ఈ సారి పోలింగ్ శాతం పెరిగింది.

శిథిలావస్థలో పాఠశాల భవనం



శిథిలావస్థకు చేరిన పాఠశాల భవనం

తాడూరు: మండలంలోని ఇంద్రకల్‌లో దాదాపు 15 ఏళ్ల కిందట నిర్మించి పాఠశాల భవనం నిర్మించారు. అధికారుల నిర్లక్ష్య వైఖరి కారణంగా ప్రభుత్వ సొమ్ము వృథా అయ్యింది. అప్పట్లో రూ.7.50 లక్షలు వెచ్చించి భవనం నిర్మించారు. కాని భవనం నిర్మించినా ప్రారంభించకపోవడంతో ప్రస్తుతం ఆ భవనం శిథిలావస్థకు చేరుకుంది. దీంతో ప్రభుత్వ నిధులు వృథా కావడంతో స్థానికులు సంబంధిత అధికారుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి భవనాన్ని వినియోగంలోకి తీసుకురావాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఫిట్‌నెస్ లేని బస్సులను నడపొద్దు



కల్వకుర్తిరూరల్: ఆర్టీసీ డిపో అధికారులు ఫిట్‌నెస్ లేని బస్సులు నడపొద్దని భారత రాష్ట్ర సమితి విద్యార్థి విభాగం నాయకుడు ఆనంద్ గౌడ్ కోరారు. శుక్రవారం కల్వకుర్తి డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు తెలకపల్లి నుంచి కల్వకుర్తికి వస్తుండగా పట్టణానికి 3 కిలోమీటర్ల దూరంలోనే బస్సు నిలిచిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో విద్యార్థులు, వృద్ధులు, దివ్యాంగులు ఇబ్బందులు గుర్తించి డిపో మేనేజర్ శ్రీకాంత్‌కు ఫోన్ చేయగా ఆయన స్పందించి మరొక బస్సును అక్కడికి పంపించారు. ఫిట్‌నెస్ లేని బస్సులు నడపకుండా ఆర్టీసీ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

కాంగ్రెస్ గెలుపు ఖాయం



వెల్దండ: కల్వకుర్తి కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి కసిరెడ్డి నారాయణరెడ్డి భారీ మెజార్టీతో గెలుస్తారని పార్టీ మండల అధ్యక్షుడు మోతీలాల్‌నాయక్ ధీమా వ్యక్తం చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణలో ప్రజలు మార్పు కోరుకుంటున్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను అధికారంలోకి వచ్చిన వెంటనే అమలు చేస్తుందన్నారు. సమావేశంలో పర్వత్‌రెడ్డి, పుల్లయ్య, రామస్వామి, శంకర్‌నాయక్, అంజయ్య, రాజు, గోపాల్, రవినాయక్ ఉన్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం



వీపనగండ్ల: విలేజ్ హెల్త్ న్యూట్రిషన్ డే ను పురస్కరించుకుని శుక్రవారం మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో అంగన్‌వాడీ టీచర్లు చిన్నారులకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో నమోదయిన గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అంగన్‌వాడీ టీచర్లు తగు సూచనలు ఇచ్చారు. వారి ఎత్తు, బరువు, హిమోగ్లోబిన్ తదితర అంశాలపైన సూచనలు చేశారు. పౌష్టికాహారం వినియోగంపై ఉన్న అపోహలను వీడాలని, పోషక విలువలతో కూడిన ఆహారాన్ని తీసుకోవడం వల్ల పలు ప్రయోజనాలు కలుగుతాయని అంగన్‌వాడీ టీచర్లు సుగుణాభాయి, మహేశ్వరీ, సువర్ణ, కమల, ఎల్లమ్మ, పారిజాత, చంద్రకళ, మాధవి, కృష్ణమ్మ, భారతి అన్నారు.

పూర్వ విద్యార్థుల చేయూత



పాన్‌గల్: మండలంలోని కేతేపల్లిలో ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన సంగనమోని శ్రీనివాసులు కుటుంబానికి 1993–94 పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల మిత్ర బృందం శుక్రవారం రూ.36 వేలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాధిత కుటుంబానికి అన్ని వేళల్లో అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

గెలుపోటములపై అంచనా

పెద్దకొత్తపల్లి: ఎమ్మెల్యే ఎన్నికలు ముగిశాక మండల నాయకులు గ్రామాల వారిగా పోలింగ్ సరళిని పరిశీలిస్తు మెజారిటీని అంచనాలు వేసుకుంటున్నారు. ఎవరికి వారు తామే గెలుస్తామనే ధీమాలో నాయకులు నిమగ్నమయ్యారు. మండలంలో 56 పోలింగ్ బూతుల్లో 44632 మంది ఓటర్లు ఉండగా మండలంలోని 25 గ్రామ పంచాయతీల్లో ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకున్నారు. 34432 మంది ఓటు వేశారు. ప్రధాన పార్టీలు బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీల మధ్యనే పోటీ ఉంది. మండలంలో రెండు పార్టీలు తమకే ఆధిక్యం లభిస్తుందని అంచనాలు వేసుకుంటున్నాయి.

ఆహ్లాదం.. బహుదూరం

- నిరుపయోగంగా పల్లె ప్రకృతి వనాలు
- పట్టించుకోని అధికారులు



యాదిరెడ్డిపల్లెలో నిరుపయోగంగా ఉన్న ప్రకృతివనం

తాడూరు: గ్రామాల్లో ఆహ్లాదకర వాతావరణం కోసం రాష్ట్ర ప్రభుత్వం పల్లె ప్రకృతి వనాలు ఏర్పాటుకు చర్యలు తీసుకుంది. గ్రామాల మధ్య, గ్రామ శివారులో ఏర్పాటు చేయాల్సిన ప్రకృతి వనాలు స్థలాల కొరత పేరుతో అటు అధికారులు, ఇటు ప్రజాప్రతినిధులు ముందు చూపు లేకుండా గ్రామాలకు దూరంగా ఏర్పాటు చేశారు. దీంతో రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన పల్లె ప్రకృతి వనాలు నిరుపయోగంగా మారాయి. ప్రభుత్వం లక్ష్యం నీరుగారుతోంది.

నెరవేరని లక్ష్యం

మండలంలో మొత్తం 24 గ్రామ పంచాయితీలలో ప్రకృతి వనాలు ఏర్పాటు చేశారు. అరఎకరం నుంచి ఎకరంన్నర వరకు స్థలంలో ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. కాని ప్రభుత్వం ప్రభుత్వ స్థలాలు గ్రామాల్లో లేక పోవడంతో అధికారులకు తలనొప్పులు తప్పడం లేదు.

తెరుచుకోని ప్రకృతి వనాలు

మండలంలో ఆయా గ్రామాల్లో అక్కడక్కడ ప్రకృతి వనాలను ఏర్పాటు చేశారు. ఆయా గ్రామాల సర్పంచ్‌లు సొంత డబ్బులు వెచ్చించి మొక్కలను కొని ఎంపిక చేసిన స్థలాలలో నాటారు. చుట్టుపక్కల ఫిన్సింగ్ ఏర్పాటు చేసి గేట్‌లు ఏర్పాటు చేసి గేట్‌లకు తాళాలు వేశారు. ఆలనాపాలనా లేక ప్రకృతి వనాలు అడవిని తలపిస్తున్నాయి.

అన్ని తక్కువ స్థలాల్లోనే

మండలంలో మేడిపూరు మినహాయిస్తే మిగతా గ్రామాలలో ఊరికి దూరంగా ఏర్పాటు చేశారు. సరైన నిర్వహణ లేకపోవడం వల్ల గేట్‌లు ధ్వంసం కావడం, ప్రకృతి వనాలలోకి పశువులు వెళ్లి మొక్కలు లేకుండా పేడతోపాటు పిచ్చి మొక్కలు దర్శనమిస్తున్నాయి. కొద్ది నెలల వరకు ప్రతి రోజు నీరు అందించడం పిచ్చి మొక్కలను తొలగించడం వంటి పనులను గ్రామపంచాయితీ సిబ్బంది నిర్వహించేది. ప్రస్తుతం ఎవరు పట్టించుకోకపోవడం వలన ప్రభుత్వ లక్ష్యం నిరుగారుతోంది. ప్రకృతి వనాలు నిరుపయోగంగా మారిపోయాయి.

సర్పంచ్‌లు పట్టించుకోవడం లేదు



ప్రభుత్వం ప్రకృతి వనాలను ఏర్పాటు చేశారు. వాటి నిర్వహణ గురించి సర్పంచ్‌లు, గ్రామస్థాయి అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో నిరుపయోగంగా మారాయి. గ్రామానికి దూరంగా ఏర్పాటు చేశారు. గ్రామస్తులు పల్లె ప్రకృతి వనాలను వినియోగించడం లేదు. అధికారులు స్పందించి పర్యవేక్షించి వినియోగంలోకి తీసుకురావాలి.

– యాదయ్య, అంతాపూర్

స్థలాలు అందుబాటులో లేవు



గ్రామాల్లో ప్రభుత్వం నిర్దేశించిన మేరకు స్థలాలు అందుబాటులో లేవు. దీంతో గ్రామ శివారులో పల్లెప్రకృతి వనాలు ఏర్పాటు చేశాం. ఇప్పటికీ పంచాయతీ కార్యదర్శులు పర్యవేక్షిస్తున్నారు. ప్రకృతి వనాలను వినియోగంలోకి తీసుకొస్తాం.

– గంగామోహన్, ఎంపీడీఓ తాడూరు

నత్తనడకన రోడ్డు నిర్మాణ పనులు



గుండూరు రఘుపతిపేట గ్రామాల మధ్య కొనసాగుతున్న రోడ్డు పనులు(ఫైల్)

కల్వకుర్తిరూరల్: ప్రజల సౌకర్యార్థం మండలంలోని గుండూరు నుంచి తెలకపల్లి వరకు డబుల్ రోడ్డు మంజూరైంది. కేంద్ర ప్రభుత్వం రూ.20 కోట్ల నిధులను మంజూరు చేసింది. గుండూరు నుంచి తెలకపల్లి మధ్య దూరం మొత్తం 18 కిలోమీటర్లు ఉంది. సంబంధిత కాంట్రాక్టర్ రెండేళ్ల కిందట రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించారు. అప్పటి నుంచి ఇప్పటికరకు నత్తనడకన పనులు కొనసాగుతుండటంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చాలా చోట్ల రోడ్డుపై కంకర వేసి వదిలేయడంతో ప్రయాణికులు, వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ద్విచక్ర వాహనదారులు ఆ రోడ్డు గుండా వెళ్తున్న సమయంలో నరకయాతన అనుభవిస్తున్నారు. లింగసానిపల్లి నుంచి రఘుపతి పేట వరకు ఒక వైపు రోడ్డును తవ్వి కంకర వేసి వదిలేశారు. రామగిరి నుంచి గౌరారం వరకు రోడ్డు మొత్తం కంకర పరిచి వదిలేయడంతో ప్రయాణికులు అనేక అవస్థలను ఎదుర్కొంటున్నారు. మండలంలోని పంజుగుల, తుర్కలపల్లి, మధ్య ఉన్న కాజ్‌వేపై రోడ్డు కుంగిపోయి ఇరు గ్రామాల ప్రజలు సమస్యలు ఎదుర్కొంటున్నారు. కాజ్ వే పనులు చేపట్టాలని అధికారులకు, ప్రజాప్రతినిధులకు ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా పట్టించుకోవడం లేదని తుర్కలపల్లి, పంజుగుల గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు.

వెంటనే పూర్తి చేయాలి



గుండూరు నుంచి తుర్కలపల్లి వరకు అసంపూర్తిగా ఉంచిన రోడ్డు పనులను వెంటనే పూర్తి చేయాలి. రోడ్లపై కంకర వేసి వదిలేశారు. దీంతో గ్రామానికి వెళ్లేందుకు ఇబ్బంది పడుతున్నాం. ద్విచక్రవాహన దారులు ప్రమాదాలబారిన పడుతున్నారు. తుర్కలపల్లి కాజ్‌వేకు మరమ్మతు చేయాలి.

– శివప్రసాద్, తుర్కలపల్లి

నెలలో పనులు పూర్తి చేస్తాం

రోడ్డు నిర్మాణ పనులు నెలలో పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకుంటాం. ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూస్తాం. త్వరలో పనులు పూర్తి చేస్తాం.

– లక్ష్మీపతి, ఏఈ ఆర్‌అండ్‌బీ

సేంద్రియం.. లాభదాయకం



మిర్చి పంటకు పిచికారి చేస్తున్న రైతు

మన్ననూర్: అమ్రాబాద్ మండలంలోని మన్ననూర్, మాచారం, వెంకటేశ్వర్లబావి, తుర్కపల్లి, వటువర్లపల్లి గ్రామాల్లో రైతులు సేంద్రియం వ్యవసాయంపై మక్కువ చూపుతున్నారు. ఎప్పటికప్పుడు ఐసీఐసీఐ ఫౌండేషన్ వారు రైతులకు సందేహాలను నివృత్తి చేస్తున్నారు. దీంతో సేంద్రియ వ్యవసాయం సాగు పెరిగింది. యాసంగి సీజన్లలో వేరుశనగ, ఆముదాలు, మిర్చి, పత్తి, మొక్క జొన్న తదితర పంటలకు సాగు చేస్తూ లాభాలను ఆర్జిస్తున్నారు. సేంద్రీయ ఎరువులతో పాటు, సేంద్రియ ద్రావణాన్ని వినియోగించి మంచి లాభాలు పొందుతున్నారు. అదేవిధంగా మిర్చి పంటను సేంద్రియం ద్వారా సాగుచేయడం ద్వారా సంస్థ ఇచ్చే సలహాలు సూచనలతో పంటలు కూడా ఆశాజనకంగా ఉన్నాయని రైతులు తెలిపారు. ఢీ కాంపోస్టు సేంద్రియ ద్రవణం పిచికారీ చేయడం, పంట పొలంలో అక్కడక్కడ జిగురు అట్టలు, లింగాకర్షక బుట్టలు, పిచ్చుక స్థావరాలను కూడా ఏర్పాటు చేస్తుండటంతో పంటలను ఎలాంటి క్రిమి కీటకాలు ఆశించడం లేదు. సేంద్రియ ద్రావణం పిచికారి చేయడంతో పంటలు తెగుళ్ల బారిన పడటం లేదని రైతులు పేర్కొన్నారు. ఐసీఐసీఐ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పాడి పెంపకం కోసం అజోళ్ల దాన, కోళ్ల పెంపకం, బోర్‌వెల్ రీచార్జ్ ఫిట్స్, డ్రమ్ములు, టార్పాలిన్, ఫారంఫండ్, సోలార్ పవర్ గ్రిడ్, పశువులకు తాగు నీటి తొట్లు, పెరటి తోటల పెంపకం, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల కోసం మరుగుదొడ్లు వంటి సహాయక, ప్రోత్సాహకాలతో పాటూ రైతులకు వ్యవసాయ మెళకువలను తెలియజేసేందుకు శిక్షణ కార్యక్రమాలు కూడా చేపడుతున్నారు.

నమ్మకం పెరిగింది



సేంద్రియ వ్యవసాయంతో పంట పెట్టుబడి తక్కువగా ఉంది. దిగుబడి అధికంగా వస్తోంది. ఐసీఐసీఐ ఫౌండేషన్ వారు సూచనలు, సలహాలు పాటిస్తున్నాం. సేంద్రియ వ్యవసాయంపై నమ్మకం పెరిగింది.

–శ్రీనయ్య, రైతు మన్ననూర్

సూచనలు ఇస్తున్నాం



క్షేత్రస్థాయిలో పొలాలకు వెళ్లి రైతుల పంటలు పరిశీలించి అవసరమైన సూచనలు ఇస్తున్నాం. పంట దశను బట్టి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తున్నాం. పంటలకు ఎలాంటి చీడ పీడలు రాకుండా రైతులను ఎప్పటికప్పుడు సిద్ధం చేస్తున్నాం.

–గంధం అంతయ్య, పెసిలిటేటర్ ఐసీఐసీఐ సంస్థ

నిరుపయోగంగా గెస్ట్ హౌస్



శిథిలావస్థకు చేరుకున్న గోపల్‌దిన్నె రిజర్వాయర్ విశ్రాంతి గదులు

వీపనగండ్ల: రైతుల ప్రయోజనం కోసం రూ.లక్షలు ఖర్చు చేసి నిర్మించిన గోపల్‌దిన్నె రిజర్వాయర్ గెస్ట్ హౌస్ శిథిలావస్థకు చేరుకుని అసాంఘీక కార్యకలాపాలకు నిలయంగా మారింది. రైతులు, జూరాల కాల్వల నీటి నిర్వహణలో పనిచేసే ఉద్యోగులకు ఉపయోగపడేలా నిర్మించిన ఈ విశ్రాంతి గదులు పోకిరీలు మద్యం తాగేందుకు నిలయంగా మారినా పట్టించుకునే వారే కరువయ్యారు. ఉన్నతాధికారులు స్పందించి వీటిని వినియోగంలోకి తీసుకురావాలని మండలంలోని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

2007లో నిర్మాణం

గోపల్‌దిన్నె రిజర్వాయర్ వద్ద ఉపయోగకరంగా ఉంటుందన్న సదుద్దేశంతో ఏప్రిల్ 2007 సంవత్సరంలో దాదాపు రూ.10 లక్షలు ఖర్చు చేసి రిజర్వాయర్ గెస్ట్ హౌస్‌ను నిర్మించారు. ఆనాటి ఎమ్మెల్యే జూపల్లి కృష్ణారావు గెస్ట్ హౌస్‌ను ఆర్భాటంగా ప్రారంభించారు. గదుల నిర్మాణంతో పాటు అవసరమైన ఫర్నీచర్‌ను కూడా అధికారులు సమకూర్చారు.

ఉద్యోగులు, రైతులకు ప్రయోజనం

గోపల్‌దిన్నె రిజర్వాయర్ ద్వారా చిన్నంబావి, పెంట్లవెల్లి, వీపనగండ్ల మండలంలోని దాదాపు 40 వేల ఎకరాలకు సాగు నీరు అందుతుంది. నీటి నిర్వహణ కోసం ఔట్‌ఫాల్ గేట్లను కూడా ఈ గెస్ట్ హౌస్ సమీపంలోనే నిర్మించారు. కాల్వల వెంట తిరిగే లస్కర్లకు ప్రయోజనం జరుగుతుందన్న ఉద్దేశ్యంతో వీటి నిర్మాణం చేపట్టారు. గెస్ట్ హౌస్ విని యోగాన్ని గాలికి వదిలేయడంతో రాత్రింబవల్లు సమీప గ్రామాల్లోని అల్లరి మూకలు మద్యం తాగు తూ సేదతీరుతున్నారు. దీంతో పాటు గదులకు బిగించిన తలుపులు , కిటికీలను ధ్వంసం చేస్తున్నా రు. వీరి ఆగడాలతో పంట పొలాలకు వెళ్లే మహిళా రైతులు నానా ఇబ్బందులకు గురవుతున్నారు.